ఓటు అడిగే హక్కు జగన్‌రెడ్డికి లేదు

- హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించారు
- వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తిచేయలేదు
- జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ

-7లో



మాట్లాడుతున్న కొణతాల

ప్రశాంత ఎన్నికలకు ప్రణాళిక

షెడ్యూలు విడుదల కాకముందే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు

- గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలు కవాతు
- నగదు, మద్యం, మత్తుపదార్థాల రవాణా నిరోధానికి చెక్‌పోస్టులు
- రౌడీలు, పాత నేరస్థులు, అల్లర్లు సృష్టించే వారి కదలికలపై నిఘా
- జిల్లాలో ఇంతవరకు 13,886 మందిపై బైండోవర్
- గత ఎన్నికల్లో కేసులు నమోదైన వ్యక్తులకు కౌన్సెలింగ్

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

సార్వత్రిక ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం ముందస్తుగానే పలురకాల చర్యలు చేపట్టింది. ఎన్నికల షెడ్యూలు విడుదల కాకముందే పోలీసు శాఖ అధికారులు సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. గ్రామాల్లో కేంద్ర సాయుధ బలగాలతో కవాతుల నిర్వహిస్తున్నారు. వాహనాల తనిఖీలకు ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. గతంలో జరిగిన ఎన్నికల్లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించిన వారిని స్టేషన్‌లకు పిలిపించి బైండోవర్ చేస్తున్నారు. పాత నేరస్థులు, రౌడీ షీటర్లు, ఇతర నేరాలతో సంబంధం వున్న వారిని పోలీసు స్టేషన్‌లకు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు.

ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, కోడ్ అమలులోకి రావడంతో జిల్లాలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేలా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి, ఎస్పీ కేవీ మురళీ కృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో ప్రణాళికలు అమలు చేస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో అవాంఛనీయ సంఘటనలు జరిగిన గ్రామాలు, పోలింగ్ కేంద్రాలను గుర్తించి, వచ్చే ఎన్నికల్లో పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1,529 పోలింగ్ కేంద్రాలు ఉండగా వీటిల్లో 330 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించారు. వీటిపై కొద్ది రోజుల నుంచి నిఘా పెట్టారు. గతంలో ఎన్నికల జరిగినప్పుడు నమోదైన పోలీసు కేసులను పునఃపరిశీలిస్తున్నారు. ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి, వాటిల్లో సమస్యాత్మక ... మిగతా 6వ పేజీలో



జిల్లా పోలీసు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ కేవీ మురళీకృష్ణ (ఫైల్ ఫొటో)



మండల కేంద్రం మాడుగులలో మంగళవారం కవాతు నిర్వహిస్తున్న సాయుధ పోలీసులు

సమన్వయంతో ఎన్నికలు నిర్వహణ

- అధికారులకు కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశం

అనకాపల్లి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సాధారణ ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన వివిధ విభాగాలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల నియమావళిపై అవగాహన పెంచుకొని పక్కాగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, సమావేశాలు, ప్రకటనలు, తదితర వాటికి అయ్యే ఖర్చును లెక్కవేయడంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎన్నికల సంఘం జిల్లాల వారీగా వ్యయ పరిశీలకులను నియమిస్తుందని, అభ్యర్థులు సమర్పించిన ఖర్చుల వివరాలను వారికి అందించాల్సి ఉంటుందన్నారు. పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను గుర్తించాలన్నారు. ఈ సమావేశంలో కో-ఆపరేటివ్ ఆడిట్ అధికారి గోవిందరాజులు, జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి మంజుల వాణి, డీఎల్‌డీఓ నాగలక్ష్మి, సీపీఓ రామారావు, పౌర సరఫరాల శాఖాధికారి ఎం.జయంతి, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి,

రోడ్ల గతి అంతేనా!

గ్రామీణ రహదారులపై వైసీపీ సర్కార్ తీవ్ర నిర్లక్ష్యం

- గతుకులు, గోతులతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లు
- ఎన్నికలు సమీపిస్తుండడంతో నిధులు విడుదలైనట్టు అర్భాటపు ప్రకటనలు
- హడావిడిగా శంకుస్థాపనలు చేసిన ప్రభుత్వ విప్
- గ్రాంటు లేదని తెలియడంతో పనులు ఆపేసిన కాంట్రాక్టర్లు

చోడవరం, మార్చి 19:

అధికారంలో వున్న ఐదేళ్ల కాలంలో రహదారులపై అంతులేని నిర్లక్ష్యం చూపించిన వైసీపీ పాలకులు.. ఎన్నికలు సమీపిస్తుండడంతో మొక్కుబడిగా కొన్ని రహదారుల పనులను హడావిడిగా ప్రారంభిస్తున్నారు. కానీ నియోజకవర్గ కేంద్రంలో మూడు మండలాలను కలిపే ప్రధానమైన చోడవరం, కన్నంపాలెం రహదారి పనులకు మాత్రం మోక్షం కలగలేదు. అధికారులు, ప్రజాప్రతినిధుల తీరుపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గ కేంద్రంలో అర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని బీఎన్ రోడ్డు పనులు నత్తనడకను తలపించే విధంగా ఉన్నాయి. మండలంలో పంచాయతీరాజ్ శాఖ అధీనంలోని రహదారుల పరిస్థితి దయనీయంగా మారింది. పీఎస్‌పేట-కన్నంపాలెం రోడ్డు పనులకు రూ.2.83 కోట్లు మంజూరుకాగా, .పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు కూడా పిలిచేశారు. రోడ్డు పనులకు గత ఏడాది ఆగస్టు 19వ తేదీన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ శంకుస్థాపన కూడా చేసేశారు. కాంట్రాక్టర్ పనులు కూడా మొదలు పెట్టారు. అయితే ఈ రోడ్డు పనులకు గ్రాంటు లేదని తెలియడంతో నిర్మాణ పనులు అర్థంతరంగా ఆపేశారు. అప్పటి నుంచి రహదారి పనులకు మోక్షం కలగలేదు.



గోతులతో అధ్వానంగా వున్న పీఎస్‌పేట- కన్నంపాలెం రోడ్డు



రూపురేఖలు మారిపోయి మట్టి రోడ్డులా మారిన అంభేరుపురం -రాయపురాజుపేట రహదారి



గ్రాంటు లేకపోవడంతో ఆగిపోయిన పీఎస్‌పేట- కన్నంపాలెం రోడ్డు పనులు

చోడవరం మండలంలో పీఎస్‌పేట, జన్నవరం, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మనపాలెం, బెన్నవోలు పంచాయతీలతోపాటు, బుచ్చెయ్యపేట, రావికమతం, అనకాపల్లి మండలాలకు కీలకమైన చోడవరం- జన్నవరం రోడ్డు అత్యంత దారుణంగా తయారై వాహనదారులు, పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఈ రహదారి దుస్థితి వర్ణనాతీతం. పగలు అష్టకష్టాలు పడి ఎదో విధంగా ప్రయణించవచ్చు. కానీ చీకటిపడితే ఈ రహదారిలో ప్రయాణం నరకప్రాయమే! ఈ రహదారిని బాగు చేయాలంటూ టీడీపీహయాంలో కరణం ధర్మశ్రీ పాదయాత్రలు చేశారు. అయన ఎమ్మెల్యే అయిన తరువాత ఈ రోడ్డు గురించి పూర్తిగా మరిచిపోయారు. ఐదేళ్లు అవుతున్నప్పటికీ కనీసం గోతులు కూడా పూడ్చించలేకపోయారు. ఇక మండలంలో అంభేరుపురం, రాయపురాజుపేటలను కలిపే రహదారి పనులు సైతం ప్రారంభం కాలేదు. ఈ రోడ్డు పనులు ఇప్పట్లో ప్రారంభం అయ్యే అవకాశం లేదని పీఆర్ ఇంజనీరింగ్ అధికారులు తేల్చి చెబుతున్నారు.

కాగా మండలంలో పలు రహదారుల పనులు ఆగిపోవడం, కొన్ని రోడ్ల పనులు ప్రారంభం కాకపోవడంపై పంచాయతీరాజ్ శాఖ డీఈ మోహన్‌ను వివరణ కోరగా, పీఎస్‌పేట-కన్నంపాలెం రోడ్డు పనులు ప్రారంభించడానికి చర్యలు చేపట్టామని, గ్రాంట్ హెడ్ కేటాయించిన తరువాత పనులు ప్రారంభం అయ్యే అవకాశం ఉందన్నారు. అంభేరుపురం-రాయపురాజుపేట రోడ్డు పనులు ఇప్పట్లో పూర్తయ్యే పరిస్థితి లేదని, ఎన్నికల అనంతరం పనులు ప్రారంభం కావడానికి అవకాశం ఉందని చెప్పారు.

నేడు ఉపమాక వెంకన్న కల్యాణోత్సవం



ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పుష్పాలంకరణ

నక్కపల్లి, మార్చి 19: ఉపమాక క్షేత్రంలో బుధవారం రాత్రి నిర్వహించే శ్రీవారి కల్యాణోత్సవానికి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఉదయం 10 గంటలకు స్వామివారు పెద్ద పల్లకీలో మాడవీధుల్లో ఊరేగుతారు. తదుపరి అష్టదిక్పాలకుల ఆవాహనం, మధ్యాహ్నం ఒంటి గంటకు ధ్వజారోహణం జరుగుతాయి. రాత్రి 10 గంటలకు ఎదురు సన్నాహ మహోత్సవం అనంతరం 11.30 గంటలకు రథోత్సవం తదుపరి స్వామివారి కల్యాణోత్సవం జరుగుతుంది. ఆలయ ప్రధాన రాజగోపురం వద్ద కల్యాణవేదికను సిద్ధం చేశారు. కాగా బుధవారం ఉదయం నుంచి గురువారం సాయంత్రం వరకు భక్తుల రద్దీ అధికంగా వుంటుంది. దీంతో పోలీసు అధికారులు సుమారు 200 మంది పోలీస్ సిబ్బందిని బందోబస్తుకు నియమించారు.



కల్యాణోత్సవాలకు అంకురార్పణ చేస్తున్న అర్చకులు

21 నుంచి 23 వరకు నూకాంబిక అమ్మవారి దర్శనం నిలిపివేత

అనకాపల్లి టౌన్, మార్చి 19: నూకాంబిక అమ్మవారి దర్శనాన్ని 21వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిలిపివేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ బండారు ప్రసాద్ తెలిపారు. నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతర సందర్భంగా బాలాలయంలోని అమ్మవారి విగ్రహానికి రంగులు వేసే నిమిత్తం మూడు రోజులపాటు భక్తులకు అమ్మవారి దర్శనభాగ్యం వుండదన్నారు. 24వ తేదీ ఉదయం నుంచి అమ్మవారి దర్శనాలు పునఃప్రారంభం అవుతాయన్నారు.



బాలాలయంలో నూకాంబిక అమ్మవారు

విద్యా వ్యవస్థలో డొల్లతనం

నూతన విధానంతో కళ తప్పిన ప్రాథమిక విద్య

- ఒకటి, రెండు తరగతులకే పరిమితమైన పలు పాఠశాలలు
- ఎక్కడా పది మందికి మించని విద్యార్థులు
- కొన్నిచోట్ల ఒకరు, ఇద్దరే పిల్లలు
- సబ్జెక్టు టీచర్లులేని ప్రాథమికోన్నత పాఠశాలలు
- అమలుకాని జీవో నంబరు 117
- విద్యా ప్రమాణాలపై ప్రతికూల ప్రభావం

మాకవరపాలెం, మార్చి 19:

విద్యా వ్యవస్థను బలోపేతం చేశామని, మౌలిక సదుపాయాలు కల్పించామని, పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత లేదని ప్రభుత్వం చెబుతున్న మాటలకు.. క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులకు పొంతన లేదు. పలు పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో హెచ్చుతగ్గులు భారీగా వున్నాయి. ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయకపోవడంతో ఆయ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలపై ప్రభావం పడుతున్నది.



మల్లవరం ప్రాథమిక పాఠశాలలో ముగ్గురు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న టీచర్




కె.తాడపాల పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు, ఒక ఉపాధ్యాయుడు

నూతన విద్యా విధానం పేరుతో ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలలను నిట్టనిలువునా చీల్చేసింది. ఒకటి, రెండు తరగతులను మాత్రమే ప్రాథమిక పాఠశాలల్లో వుంచి, 3, 4, 5 తరగతులను సమీపంలోని ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దీంతో 1, 2 తరగతులున్న పాఠశాలల్లో విద్యార్థులకు తక్కువ, ఉపాధ్యాయులు ఎక్కువ వున్నారు. మరోవైపు 3, 4, 5 తరగతులను విలీనం చేసిన పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడ ఉపాధ్యాయులు లేరు. పైగా ఇక్కడ స్కూల్ అసిస్టెంట్లకు బదులు సెకండరీ గ్రేడ్ టీచర్లు వున్నారు. మాకవరపాలెం మండలంలో పలు ప్రాథమిక పాఠశాలలు ప్రస్తుతం 1, 2 తరగతులు మాత్రమే నడుస్తున్నాయి. వీటిల్లో కనీస స్థాయిలో కూడా విద్యార్థులు లేరు. కె.తాడపాల ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు పాఠాలు బోధించడానికి ఒక ఉపాధ్యాయుడు వున్నారు. మల్లవరం పాఠశాలలో ముగ్గురు విద్యార్థులు-ఒక టీచర్, వెంకయ్యపాలెం పాఠశాలలో ఇద్దరు విద్యార్థులు- ఒక టీచర్; జడ్.గంగవరం పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు- ఒక ఉపాధ్యాయుడు, జి.కోడూరులో ఏడుగురు విద్యార్థులుకు ఇద్దరు ఉపాధ్యాయులు, చినరాచపల్లి పాఠశాలలో 12 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు, కామేశ్వరి నగర్ పాఠశాలలో ఆరుగురు ... మిగతా 6వ పేజీలో

అదనపు షాక్

వినియోగదారులపై ఈపీడీసీఎల్ దొంగదెబ్బ

- 250 యూనిట్లలోపు వినియోగిస్తున్న వారికి నోటీసులు
- ఎక్కువ లోడ్ పడుతున్నందున అర్జెంట్‌గా రూ.4,450 కట్టాలని ఆదేశం
- నెలాఖరులోగా చెల్లించకపోతే కనెక్షన్ కట్ అంటూ హెచ్చరికలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఈపీడీసీఎల్) అధికారులు ఆదాయం పెంచుకోవడానికి వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. గతంలో ఒకసారి అదనపు లోడ్ అంటూ నోటీసులు ఇచ్చి కొద్దిపాటి మొత్తాలు వసూలు చేశారు. ఇప్పుడు మళ్లీ అదేబాటలో వెళుతూ నోటీసులు ఇస్తున్నారు.

ఈపీడీసీఎల్ సిబ్బంది కొద్ది రోజులుగా నెలకు 75 యూనిట్ల నుంచి 250 యూనిట్ల మధ్య వినియోగించే వారి ఇళ్లకు వెళ్లి ఏయే విద్యుత్ పరికరాలు వినియోగిస్తున్నారో పరిశీలిస్తున్నారు. ఒక కిలోవాట్ కోసం విద్యుత్ కనెక్షన్ తీసుకొని ఎక్కువ లోడ్ వాడుతున్నారని చెబుతున్నారు. కనెక్షన్ కోసం దరఖాస్తు చేసినప్పుడు ఏసీ, వాషింగ్ మెషిన్ వంటివి చూపించలేదని, ఇప్పుడు అవన్నీ వినియోగిస్తున్నందున ఎక్కువ లోడ్ పడుతోందని, అందుకు తగిన మొత్తాలు చెల్లించాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఆ తరువాత రెండు రోజులకు ఒక నోటీసు పంపుతున్నారు. ఒక కిలోవాట్‌కు బదులు మూడు కిలోవాట్లు వాడుతున్నందున, అదనంగా ... మిగతా 6వ పేజీలో

క్రమబద్ధీకరించుకోకపోతే ఇబ్బందే

అదనపు లోడు విషయాన్ని ఈపీడీసీఎల్ జోనల్ అధికారి వద్ద ప్రస్తావించగా వినియోగదారులు నిర్దేశించిన లోడుకు మించి ఉపయోగిస్తున్నప్పుడు దానికి అదనపు చార్జీలు చెల్లించక తప్పదని స్పష్టంచేశారు. నోటీసులు అందుకున్నవారు ఎవరైనా అదనపు లోడు వినియోగించకపోతే దానిని లేఖ ద్వారా తెలియజేయవచ్చునని, మరోసారి వచ్చి పరిశీలిస్తారన్నారు. నిర్ధారణ అయితే దానికి సూచించిన ఫీజులు డీడీ రూపంలో కట్టి మీ-సేవా కేంద్రంలో ప్రత్యేక దరఖాస్తు ద్వారా క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు. - ఈపీడీసీఎల్ జోనల్ అధికారి

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (బుధ)	6.11
సహరి (గురు)	4.48

కలగానే కాలేజీలు!

నీటి మూటలుగా ధర్మశ్రీ మాటలు

- కొత్తకోటలో డిగ్రీ, రావికమతంలో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేయిస్తానని గత ఎన్నికల్లో హామీ
- డిగ్రీ కళాశాలకు భూమిని విరాళంగా ప్రకటించిన దాతలు
- ఐదేళ్లయినా ఏర్పాటుకు నోచుకోని విద్యా సంస్థలుట

రావికమతం, మార్చి 19:

మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయిస్తానన్న ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. డిగ్రీ కళాశాల కోసం సుమారు కోటి రూపాయల విలువచేసే భూమిని కొత్తకోటకు చెందిన ఒక కుటుంబ విరాళంగా ప్రకటించినప్పటికీ... కళాశాలను మంజూరు చేయించడంలో ఎమ్మెల్యే విఫలం అయ్యారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

"తమ ప్రభుత్వం విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చింది. దీనిలో భాగంగా బాలిక విద్యకు పెద్ద పీట వేస్తున్నది. రావికమతం మండలంలో డిగ్రీ కళాశాల లేకపోవడంతో బాలికలు నర్సీపట్నం, చోడవరం వంటి దూర ప్రాంతాలకు వెళ్లలేక ఇంటర్‌తోనే చదువులు ఆపేస్తున్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే కొత్తకోటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, రావికమతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయిస్తాను. అమ్మాయిలు ఉన్నత విద్యను అభ్యసించడానికి నా వంతు కృషి చేస్తాను" అని కరణం ధర్మశ్రీ అన్నారు. అయితే ఆయన ఈ మాటలు అన్నది ఇప్పుడు కాదు.. సుమారు ఐదేళ్ల క్రితం గత సాధారణ ఎన్నికల సమయంలో! ఆయన కోరినట్టు ప్రజలు ఓట్లేసి ఎమ్మెల్యేగా గెలిపించారు. ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ అధికారంలోకి వచ్చింది. దీంతో కొత్తకోటలో డిగ్రీ కళాశాల, రావికమతంలో జూనియర్ కళాశాల ఏర్పాటవుతాయని ప్రజలు ఆశగా ఎదురు చూశారు. ఏడాది.. రెండేళ్లు.. మూడేళ్లు... నాలుగేళ్లు... ఐదేళ్లు గడిచిపోయాయి. కళాశాలలు మాత్రం ఏర్పాటు కాలేదు. ఎమ్మెల్యే అయిన కరణం ధర్మశ్రీ మాత్రం రెండేళ్ల క్రితం ప్రభుత్వ విప్ పదవి కూడా పొందారు. కళాశాలల ఏర్పాటు హామీని సొంత పార్టీ నాయకులు, కార్యకర్తలే పలుమార్లు ధర్మశ్రీ దృష్టికి తీసుకెళ్లారు. అయినా పట్టించుకోలేదు.

ఇదిలావుండగా కొత్తకోట గ్రామానికి చెందిన పైల సన్యాసమ్మ తన భర్త జ్ఞాపకార్థం కోటి రూపాయలకుపైగా విలువ చేసే మూడు ఎకరాల భూమిని డిగ్రీ కళాశాలకు విరాళంగా ఇచ్చారు. కానీ కరణం ధర్మశ్రీ మాత్రం డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయించలేకపోయారు. ఐదేళ్ల క్రితం ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలని ధర్మశ్రీ.. ఈసారి ఎన్నికల్లో ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడుగుతారని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.



కొత్తకోటలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు స్థానికులు విరాళంగా ఇచ్చిన భూమి ఇదే

రంగు మారిన స్టేజ్

» ఆంధ్రజ్యోతి ఎఫెక్టు



స్టేజీపై నీలం రంగుపై తెలుగు రంగు వేసిన దృశ్యం

అచ్యుతాపురం, మార్చి 19: మండల కాంప్లెక్స్ వద్ద స్టేజీకి అధికారులు మంగళవారం రంగు మార్చారు. అయితే నిధుల కొరతో లేక వైసీపీ నాయకుల ఒత్తిడో తెలియదు గాని వైసీపీ జెండా ఆకారాన్ని అధికారులు మార్చారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. కేవలం తెల్ల రంగు వేసి వైసీపీ జెండా రంగును మార్చారు. పైన ఆకుపచ్చ రంగును అలాగే వదిలేసి, నీలం రంగుపై తెలుపు రంగు వేశారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు : డీఎస్పీ



సబ్బవరం హైస్కూల్లో సిబ్బందితో పరవాడ డీఎస్పీ సత్యనారాయణ

సబ్బవరం, మార్చి 19 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ హైస్కూల్, ప్రతిభ విద్యాలయంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రా లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరవాడ సబ్‌డివిజన్‌లో 27 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు మాల్ ప్రాక్టీస్ జరగకుండా జరుగుతున్నాయన్నారు. కాగా సబ్బవరంలో ఏర్పాటు చేసిన ఐదు పరీక్షా కేంద్రాల్లో మంగళవారం పరీక్షకు ఏడుగురు గైర్హాజరయ్యారని ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు.

రాజకీయ పక్షాల నేతలతో ఆర్వో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్వో మనోరమ

ఎలమంచిలి, మార్చి 19 : ఎన్నికల నియమావళిని రాజకీయ పక్షాల నేతలు విధిగా పాటించాలని ఎలమంచిలి అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి మనోరమ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పక్షాల నేతలు, అధికారులతో వేర్వేరుగా జరిగిన సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం రాజకీయ పార్టీల నేతలు నిర్వహించే సభలు, సమావేశాలకు విధిగా అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నేతలు, అధికారులు పాల్గొన్నారు.

వారు వైసీపీ వారు కాదు : మల్లవరం సర్పంచ్

అచ్యుతాపురం, మార్చి 19: తమ పంచాయతీ శివారు నరేంద్రపురం నుంచి సోమవారం జనసేనలో చేరిన వారు వైసీపీకి చెందిన వారు కాదని మల్లవరం సర్పంచ్ పిన్నమ రాజు వాసు అన్నారు. మంగళవానం ఆచప విలేకర్లతో మాట్లాడుతూ వెంకటరమణ పంచాయతీ ఎన్నికల్లో తనపై పోటీచేసి ఓడిపోయారన్నారు. కిల్లాడి వేంకటరావు తమ పార్టీ సభ్యుడు కాదన్నారు

వైసీపీలో చేరికలు

రాంబిల్లి, మార్చి 19 : మండలంలోని కొత్తపట్నంలో మంగళవారం వైసీపీ నాయకుడు చోడిపల్లి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ చోడిపల్లి నూకరాజు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 25 కుటుంబాలు ఎమ్మెల్యే యూవీ. రమణమూర్తిరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమార్‌వర్మల సమక్షంలో వైసీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, సుకుమార్‌వర్మ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జడ్‌పీటీసీ సభ్యుడు ధూళి నాగరాజు, వైసీపీ మండల కన్వీనర్ పి.కిశోర్, మాజీ కన్వీనర్ జి.శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ పి.తాతబాబు పాల్గొన్నారు.

ఘనంగా గంగాదేవి గావు పండుగ

సబ్బవరం, మార్చి 19: సబ్బవరం శివారు చినగొల్లల పాలెంలో గంగాదేవి గావు పండుగ మంగళవారం ఘనంగా జరిగింది. ఉదయం ఆరు గంటల నుంచి అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్న సమారాధన జరిగింది. మూడు గంటలకు పందిరి దూపు కార్యక్రమం, గావు పాట, పాలేటికి వెళ్లే కార్యక్రమాలు జరిగాయి. అమ్మవారిని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు పీబీవీఎస్ఎన్ రాజు, మాజీ ఎంపీపీ గండి దేముడు, రేమాల చంద్రశేఖర్, పల్లా తాతారావు, పల్ల కృష్ణ, పల్ల సన్యాసిరావు దర్శించుకున్నారు.

బీఎస్పీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు

నర్సీపట్నం, మార్చి 19 : నర్సీపట్నం నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు కృష్ణాపురం గ్రామానికి చెందిన బొట్టా నాగరాజు తెలిపారు. ఎస్ఎఫ్ఐలో జిల్లా కార్యదర్శి ఉపాధ్యక్షుడుగా, ఉత్తరాంధ్ర హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌గా పనిచేశానని తెలిపారు. తనకు పోటీ చేసే అవకాశం ఇచ్చిన రాష్ట్ర కమిటీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

నిబంధనలను తప్పకుండా పాటించండి

» అనకాపల్లి ఎన్నికల అధికారి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి

అనకాపల్లి టౌన్, మార్చి 19 : ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలను విధిగా పాటించాలని అనకాపల్లి నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి జాహ్నవి స్పష్టం చేశారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ప్రచారాలకు ముందస్తు అనుమతులు తీసుకోవాలని సూచించారు. 48 గంటల ముందు అనుమతులు తీసుకున్న తర్వాత ప్రచారాలు చేయాలన్నారు. అంతేకాకుండా ప్రచారానికి వెళ్లేటప్పుడు ఎంతమంది ప్రచారంలో హాజరవుతున్నారో వివరాలు తెలియజేయాలన్నారు. మైక్‌సెట్లు, డీజే వంటి పరికరాలకు అనుమతులు తప్పనిసరని ఆమె స్పష్టంచేశారు. సమావేశంలో రాజకీయ నేతలు పాల్గొన్నారు.



రాజకీయపార్టీల నాయకులతో మాట్లాడుతున్న ఎన్నికల అధికారిణి జాహ్నవి

సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

» పార్టీ గెలిస్తే గెడ్డం బుజ్జికి నాతోపాటు సమాన హోదా

» 'పేట'లో జనసేన నియోజకవర్గ ఆత్మీయ సమావేశంలో అనిత



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వి.అనిత

పాయకరావుపేట, మార్చి 19 : రానున్న ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు సమిష్టి కృషిచేయాలని పాయకరావుపేట ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత కోరారు. మంగళవారం జనసేన పార్టీ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో ఇక్కడ జరిగిన నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో అరాచక, విధ్వంస పాలన చేస్తున్న జగన్ ప్రభుత్వంపై టీడీపీ, జనసేన, బీజేపీ యుద్ధం చేస్తున్నాయన్నారు. 2014లో మొదటిసారిగా ఎమ్మెల్యేగా గెలిచిన తనకు రాజకీయ అనుభవం, అవగాహన లేక కొన్ని తప్పులు జరిగాయని, అందుకు తాను క్షమాపణలు చెబుతున్నానన్నారు. ఈసారి అలా జరగదని హామీ ఇస్తున్నానన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత జనసేన పార్టీ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జికి నాతోపాటు సమాన హోదా ఉంటుందని ప్రమాణం చేస్తున్నానన్నారు. అంతకుముందు గెడ్డం బుజ్జి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపు కోసం టీడీపీతో కలిసి పనిచేసేందుకు తామంతా సిద్ధంగా ఉన్నామన్నారు. రానున్న రోజుల్లో మండల, గ్రామస్థాయిలో టీడీపీ, జనసేన శ్రేణులతో కమిటీలు వేసి, కార్యక్రమాలు ఉమ్మడిగా చేపడదామన్నారు. అనంతరం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి అనితకు జనసేన పార్టీ నాలుగు మండలాల నాయకులను గెడ్డం బుజ్జి పరిచయం చేశారు. ఈ సమావేశంలో టీడీపీ, జనసేన పార్టీల నాలుగు మండలాల అధ్యక్షులతోపాటు ఇరు పార్టీల ముఖ్య నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న అనిత

రంజాన్ మాసంలో భాగంగా పాయకరావుపేటలో మంగళవారం ముస్లిం సోదరులు నిర్వహించిన ఇఫ్తార్ విందులో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి వంగలపూడి అనిత పాల్గొన్నారు. స్థానిక ముస్లిం వీధిలోని మసీదులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ టీడీపీ హయాంలో ముస్లిం సోదరులకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలుతోపాటు ఏటా రంజాన్ తోఫా అందజేయడం జరిగిందన్నారు.అనంతరం నిర్వహించిన ప్రార్థన, ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే వి.అనిత, టీడీపీ నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, పెదిరెడ్డి శ్రీను, బొంది కాశీవిశ్వనాథం, పల్లా విలియంకేరి, ఎం.రమాకుమారి, మలిపెద్ది వెంకటరమణ, ముస్లిం సోదరులు మహమ్మద్ జాకీర్, తాజుద్దీన్, రూహుల్లా షరీఫ్, ఎండీ.కరీముల్లా, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలోకి 'గూటూరు'కు ఆహ్వానం

పాయకరావుపేట, మార్చి 19 : వైసీపీ నుంచి సస్పెండ్ అయిన వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావును జనసేన పార్టీలోకి రావాలంటూ ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి గెడ్డం బుజ్జి ఆహ్వానించారు. మంగళవారం పాయకరావుపేటలోని గూటూరు శ్రీనివాసరావు నివాసానికి వెళ్లిన గెడ్డం బుజ్జి మాట్లాడుతూ జనసేనలో చేరితే పార్టీలో సముచిత స్థానం కల్పించి గౌరవిస్తామని హామీ ఇచ్చారు. దీనిపై గూటూరు శ్రీనివాసరావు మాట్లాడుతూ పార్టీ నాయకులు, అభిమానులతో చర్చించి త్వరలో నిర్ణయాన్ని తెలియజేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గెడ్డం చైతన్య యగదాసు నానాజీ, నారపురెడ్డి పద్మ, శివలంక నాగమల్లి, ఆచంట దొర తదితరులు పాల్గొన్నారు.



గూటూరు శ్రీనుతో చర్చలు జరుపుతున్న గెడ్డం బుజ్జి, తదితరులు

సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ తరలింపు రికార్డుల పరిశీలన

కొత్తూరు, మార్చి 19: అనకాపల్లి జాయింట్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు రికార్డులను ఆర్టీఐ చట్టం ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపునకు సంబంధించి రికార్డులోని 22 పేజీల సమాచారాన్ని ఆయనకు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్. జానకీదేవి అందజేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు ఫైళ్ల పరిశీలనకు రాష్ట్ర ఆర్టీఐ కమిషనర్ ఆదేశించడంతో ఫైళ్ల పరిశీలనకు రిజిస్ట్రేషన్ అధికారులు అనుమతించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వులు లేకుండా ప్రజలకు అందుబాటులో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని కొత్తూరు జంక్షన్‌కు స్వీయ ప్రయోజనాలను ఆశించి తరలించారని ఆరోపించారు. ఈ విషయం రికార్డుల పరిశీలనలో బహిర్గతమైందన్నారు. దీనికి బాధ్యులైన అధికార యంత్రాంగంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు ఆయన వెల్లడించారు.



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న వెంకటరమణ

పారిశుధ్య పనులు చేయించిన జనసేన నేత

రాంబిల్లి, మార్చి 19 : మండలంలోని అప్పారాయుడుపాలెంలో మంగళవారం జనసేన పార్టీ నాయకులు సుందరపు లోవరాజు సొంత నిధులతో పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో ఎక్కడి పడితే అక్కడ చెత్త పేరుకుపోవడం, కాలువల్లో పూడిక పేరుకుపోయినా పంచాయతీ పాలకులు , అధికారులు పట్టించుకోలేదు. దీంతో లోవరాజు స్పందించి తన సొంత నిధులతో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పటు చేసి గ్రామంలో పేరుకుపోయిన చెత్తను తొలగించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఉరిటి నానాజీ, దాడి సంతోష్ పాల్గొన్నారు.



పారిశుధ్య పనులు దగ్గరుండి చేయిస్తున్న సుందరపు లోవరాజు

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

» పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ

సబ్బవరం, మార్చి 19 : ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చినందున ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం సబ్బవరం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. పరవాడ సబ్‌డివిజన్ పరిధిలో గుల్లేపల్లి, మర్రిపాలెం, దేశపాత్రునిపాలెం, నక్కపల్లి వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటుచేసినట్టు తెలిపారు. చెక్‌పోస్టులు వద్ద 24/7 తనిఖీలు నిర్వహిస్తారన్నారు. మద్యం, డబ్బులు, కానుకలు పంపిణీ చేయకుండా పటిష్ట చర్యలు తీసుకున్నామన్నారు. వీటిని ఎక్కడైన పంపిణీ చేస్తే తమకు గానీ, 100కి గానీ కాల్ చేసి సమాచారం ఇవ్వవచ్చునన్నారు. సభలు, సమావేశాలు, లౌడు స్పీకర్లకు తప్పనిసరిగా ఆర్వో అనుమతులు ఉండాలన్నారు. రాజకీయ నేతలకు తాము సహకరిస్తామని, వారు తమకు సహకరించాలన్నారు. సమావేశంలో సీఐ పిన్నింటి రమణ, ఎస్ ధనుంజయ్ పాల్గొన్నారు.

ఘనంగా పైడితల్లి జాతర

రాంబిల్లి, మార్చి 19 : మండలంలోని కృష్ణంపాలెం శివారు నారప్పపాలెంలో మంగళవారం పైడితల్లి జాతర వైభవంగా జరిగింది. రెండేళ్లకు ఒక సారి నిర్వహించే జాతరను గ్రామస్థులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించి, పసుపు, కుంకుమలను సమర్పించారు. భారీగా బాణసంచా కాల్చారు. సాయంత్రం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా పరదేశిమాంబ విగ్రహ ప్రతిష్ఠ

సబ్బవరం, మార్చి 19 : సబ్బవరం శివారు ఆదిరెడ్డిపాలెంలో పరదేశిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి కుంకుమ పూజలు, చండీ పారాయణం, మహా చండీ హోమం, మండప పూజలు, తదితర పూజా కార్యక్రమాలు చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన్ని ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కొటాన రాము, అప్పారావు, ఆదిరెడ్డి రమణ, కోటయ్య సత్కరించారు.



పరదేశిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

జైభారత్ పార్టీ అనకాపల్లి కో-ఆర్డినేటర్‌గా కనిశెట్టి

అనకాపల్లి టౌన్, మార్చి 19 : జై భారత్ పార్టీ అనకాపల్లి నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా పట్టణానికి చెందిన కనిశెట్టి సురేష్‌బాబు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకులు సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ నుంచి ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. అలాగే నియోజకవర్గ కన్వీనర్‌గా కాండ్రేగుల చక్రవర్తి, పార్లమెంట్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా ఆడారి శరత్‌చంద్రలను నియమించినట్టు సురేష్‌బాబు తెలిపారు.

పలు గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

రాంబిల్లి, మార్చి 19 : సార్వత్రిక ఎన్నికల్లో నేపథ్యంలో మంగళవారం రాంబిల్లి సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో పెదకలవలాపల్లి, రాంబిల్లి, వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాల్లోని కేంద్ర బలగాలు కవాతు నిర్వహించాయి. స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం

కశింకోట, మార్చి 19 : మండలంలోని బయ్యవరంలో కనకమహాలక్ష్మి తీర్థం జరగనుందని ఉత్సవ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఇప్పటికే ఉత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఆలయ ప్రాంగణమంతా విద్యుత్ దీపాలంకరణ చేశామని చెప్పారు. బుధవారం ఉదయం నుంచి అమ్మవారికి పలు ప్రత్యేక అభిషేకాలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

విద్యా వ్యవస్థలో డొల్లతనం

... 5వ పేజీ తరువాయి

విద్యార్థుకు ఇక ఉపాధ్యాయుడు, తామరం పాఠశాలలో ఆరుగురు విద్యార్థుకు ఇక ఉపాధ్యాయుడు, బూరుగుపాలెం స్కూల్లో నలుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు వున్నారు. ఇంకా చంద్రయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, ఎన్‌జీఆర్‌పీ అగ్రహారం పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాల్లో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా వుంది. ఇటీవల జారీ చేసిన జీవో 117 ప్రకారం ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్లు (సబ్జెక్టు టీచర్లు) బోధన చేయాలి. కానీ పైడిపాల, తూటిపాల, దాలింపేట, కొండలఅగ్రహారం, రామన్నపాలెం, పీపీఅగ్రహారంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు లేరు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతోనే బోధన సాగిస్తున్నారు. మండలంలో 12 ప్రాథమికోన్నత పాఠశాలలు వుండగా.. జంగాలపల్లి, వెంకటాపురం పాఠశాలల్లో మాత్రమే 117 జీవో ప్రకారం స్కూల్ అసిస్టెంట్‌లు వున్నారు. మిగిలిన పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడంలేదు. దీనిపై ఎంఈవో మూర్తిని వివరణ కోరగా, ప్రసుత్తం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో సబ్జెక్టు టీచర్ (స్కూల్ అసిస్టెంట్లు) పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయలేదని, దీంతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతోనే బోధన చేయిస్తున్నామని చెప్పారు.

ప్రశాంత ఎన్నికలకు ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని ఇప్పటికే సేకరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎటువంటి బందోబస్తు చర్యలు చేపట్టాలనే దానిపై దృష్టి పెట్టారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతులు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, ఓటర్లను రెచ్చగొట్టేలా వ్యవహరించిన వారిని స్టేషన్‌లకు పిలిపించి బైండోవర్ చేస్తున్నారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో మొత్తం 13,886 మందిని బైండోవర్ చేశారు. ఇందులో 11,397 మందిని ఎన్నికల్లో వివాదాలు సృష్టించే అవకాశాలున్నాయనే అనుమానంతో బైండోవర్ చేయగా, 26 మంది పాత నేరస్థులు వున్నారు. అదే విధంగా గత ఎన్నికల సందర్భంగా వివాదాలు సృష్టించిన 2,756 మందిని బైండోవర్ చేశారు. ఇక రౌడీ షీటర్లు, ఇతరత్రా నేరాలతో సంబంధంవున్న వ్యక్తులను ఇప్పటికే పోలీసు స్టేషన్‌లకు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తున్నారు. ఎన్నికల వేళ మద్యం, నగదు, మత్తు పదార్థాలు వంటివాటి రవాణాను కట్టడి చేసేందుకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలను 24 గంటలూ తనిఖీ చేయడానికి అవసరమైన సిబ్బందిని నియమించారు. కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు ఆకస్మికంగా పర్యటిస్తూ, ఈ చెక్‌పోస్టులను పరిశీలిస్తున్నారు. వాహనాల తనిఖీలకు సంబంధించి సిబ్బందికి పలుసూచలను చేస్తున్నారు.

అదనపు షాక్

... 5వ పేజీ తరువాయి

రెండు కిలోవాట్లకు సర్వీస్, డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్, అప్లికేషన్ ఫీజుతో పాటు జీఎస్‌టీ చెల్లించాలని అంటున్నారు. మొత్తం రూ.4,459 కట్టాలని డిమాండ్ నోటీసులు పంపుతున్నారు. అందులో రూ.4 వేలు అచ్చం డెవలప్‌మెంట్ చార్జీల కింద చూపిస్తున్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.400, అప్లికేషన్ ఫీజు రూ.50, జీఎస్‌టీగా రూ.9 వేసి మొత్తం రూ.4,459 నెలాఖరులోగా చెల్లించాలని ఆదేశిస్తున్నారు. అలా చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని, ఆ మొత్తం చెల్లించాకే పునరుద్ధరిస్తామని అంటున్నారు. ఇలా ఒక్క జోన్-3లోనే రెండు వేల మందికి నోటీసులు జారీచేశారు. అలాగే జోన్-2, జోన్-1లో కూడా వేలాది మందికి ఈ నోటీసులు ఇస్తున్నారు. వీరంతా మధ్య తరగతివారే కావడం గమనార్హం.

వైభవంగా నల్లమారమ్మతల్లి పండుగ



నల్లమారమ్మతల్లిని దర్శించుకుంటున్న దాడి రత్నాకర్

కొత్తూరు, మార్చి 19 : అనకాపల్లి మండలం సీతానగరంలో నల్లమారమ్మతల్లి పండుగ మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అలంకరించారు. ఈ సందర్భంగా అనకాపల్లి నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ, టీడీపీ ఉమ్మడి జిల్లా మాజీ అధ్యక్షుడు దాడి రత్నాకర్, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పలు నేల వేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గంగుపాం సత్యనారాయణ, దొర, గంగుపాం సర్వేశ్వరరావు, బొబ్బాది రమణ, తెల్లాకుల ప్రసాదరావు, సుంకర చంటిబాబు, నాగేశ్వరరావు, రామరాజు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

కశింకోట, మార్చి 19 : క్షయ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి తిరుపతిరావు అన్నారు. మంగళవారం కశింకోట వీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ టీబీ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పరమానందరావు, పీహెచ్ఎన్ సత్యవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో ఉమ్మడి కోర్ కమిటీల నియామకం

కశింకోట, మార్చి 19 : మండలంలోని సోమవరం, గొబ్బూరు, చెరకాం, తీడ, కన్నూరుపాలెం, సుందరయ్యపేట, జి.భీమవరం, అడ్డాం, అచ్చెర్ల గ్రామాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కార్యకర్తలు మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కోర్ కమిటీ సభ్యులను నియమించారు. మాజీ ఎంపీపీ కూండ్రపు రామునాయుడు, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, తెలుగు రైతు జిల్లా అధికార ప్రతినిధి ఉగ్గిన రమణమూర్తి, జనసేన మండల అధ్యక్షుడు బుదిరెడ్డి చిన్న, టీడీపీ మండల అధ్యక్షుడు కాయల మురళీ, సిదిరెడ్డి శ్రీనివాసరావు, నైనంశెట్టి రమణారావు మాట్లాడారు. ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఘనంగా పోలమాంబ పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న పంచకర్ల రమేష్‌బాబు,తదితరులు

పరవాడ, మార్చి 19: ఈదులపాక ఫార్మా పునరావాసకాలనీలో పోలమాంబ అమ్మవారి పండగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ముడుపులు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, సర్పంచ్‌లు బొద్దపు శ్రీనివాసకాసులు, మోటూరి సన్యాసినాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఘటాలను మేళతాళాల నడుమ ఊరేగించి అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవం నిర్వహించారు. రాత్రి ఏడు గంటల నుంచి పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాట్లు చేశారు.

24న జిల్లాస్థాయి కోలాటం పోటీలు

పరవాడ, మార్చి 19 : మండల కేంద్రంలోని పైడిమాంబ పండగ పురస్కరించుకుని ఈనెల 24న స్థానిక సంతబయలు వద్ద జిల్లాస్థాయి కోలాటం పోటీలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు నామినేషన్ ఫీజు కింద రూ.200 చెల్లించాలన్నారు. విజేతలకు వరుసుగా రూ.15వేలు, రూ. 12వేలు, రూ.తొమ్మిదివేలు, రూ. ఆరువేలు, రూ. మూడు వేలు చొప్పున నగదుతో పాటు జ్ఞాపికలను అందజేస్తామన్నారు. మరిన్ని వివరాల కోసం 9000490200, 8328668559 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

వైభవంగా పైడిమాంబ గరగ మహోత్సవం

పరవాడ, మార్చి 19: మండల కేంద్రంలోని పైడిమాంబ అమ్మవారి పండగలో భాగంగా సోమవారం రాత్రి గరగ ఉత్సవం ప్రారంభమైంది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పైడిమాంబ గరగకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గరగను పురవీధుల్లో మేళతాళాలతో ఊరేగించారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు, ఎంపీటీసీ సభ్యుడు పైలా శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ బండారు రామారావు, మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు, పైలా పోతునాయుడు, సిరపురపు అయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.

'వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేస్తే చర్యలు'

నక్కపల్లి, మార్చి 19: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వలంటీర్లు ఎన్నికల ప్రచారం చేసినా, ఓటర్లను ప్రలోభపెట్టినట్టు రుజువైతే ఉద్యోగానికే ప్రమాదమని పాయకరావుపేట రిటర్నింగ్ అధికారిణి గీతాంజలి హెచ్చరించారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. వలంటీర్లు కచ్చితంగా ఎన్నికల కోడ్‌ను పాటించాలన్నారు. వలంటీర్లు రాజకీయపార్టీల ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనకుండా చూడాలని ఎంపీడీవోలకు సమాచారం ఇచ్చామన్నారు.

పెందుర్తి టికెట్‌పై పునరాలోచన చేయాలి



నిరసన యాత్ర చేపడుతున్న టీడీపీ శ్రేణులు

పరవాడ, మార్చి 19 : పెందుర్తి టికెట్ మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ మంగళవారం రాత్రి టీడీపీ శ్రేణులు నిరసన యాత్ర చేపట్టాయి. బండారు స్వగ్రామం వెన్నెలపాలెం నుంచి యాత్ర ప్రారంభమై సినిమాహాల్ జంక్షన్ మీదుగా పరవాడ సంతబయలు వరకు కొనసాగింది. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పెందుర్తి అసెంబ్లీ టికెట్ విషయంలో పునరాలోచన చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీపీ మానవరపు అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు వియ్యపు చిన్న, పార్టీ నాయకులు రథాల సన్యాసిరావు, బొండా సన్నిదేముడు, కూండ్రపు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

నర్సీపట్నం
నియోజకవర్గం

బీఎస్పీ అభ్యర్థిగా బొట్టా నాగరాజు



నర్సీపట్నం, మార్చి 19 : నర్సీపట్నం నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్టు కృష్ణాపురం గ్రామానికి చెందిన బొట్టా నాగరాజు తెలిపారు. ఎస్ఎఫ్ఐలో జిల్లా కార్యదర్శి, ఉపాధ్యక్షుడుగా, ఉత్తరాంధ్ర హక్కుల సాధన సమితి జిల్లా కన్వీనర్, బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జ్‌గా పనిచేశానని తెలిపారు. బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇచ్చిన రాష్ట్ర పార్టీ కమిటీకి ఆయన ధన్యవాదాలు తెలిపారు.

వరి కుప్పకు నిప్పు

నాతవరం, మార్చి 19 : మండలంలోని పిఎస్‌డీ పాలెంలో సోమవారం అర్ధరాత్రి వరికుప్పకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలిబూడిదైంది. గ్రామంలోని వెలగడ వెంకన్న అనే రైతుకు చెందిన ఎకరన్నర పొలంలో వరి పంటను కుప్పపెట్టారు. మరో రెండురోజులలో వరికుప్పను నూర్చుడానికి ఏర్పాట్లు చేసుకున్న సమయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వరికుప్పకు నిప్పు పెట్టారు. గ్రామానికి దగ్గరల్లోనే వరి కుప్ప ఉండడంతో గ్రామస్థులు ఆర్పడానికి ప్రయత్నించారు. అప్పటికే మూడొంతులు కాలిపోయింది. చేతికి వచ్చిన వరిపంట కళ్ల ఎదుటే కాలిపోయిందని రైతు వెంకన్న లబోదిబోమంటున్నాడు. వీఆర్‌ఓ అప్పారావు కాలిపోయిన వరికుప్పను పరిశీలించారు ప్రభుత్వం తనను ఆదుకోవాలని వెంకన్న కోరుతున్నాడు. మండల వైస్ ఎంపీపీ షైనం నాగగోపీ, సర్పంచ్ వి. కొండబాబు తదితరులు రైతు వెంకన్నను పరామర్శించారు. వరికుప్పకు నిప్పు పెట్టిన వ్యక్తిని గుర్తించి శిక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

వైసీపీ నుంచి కాంగ్రెస్‌లోకి ..

గొలుగొండ, మార్చి 19: మండలంలోని కొత్తమల్లంపేటలో వైసీపీ నుంచి కాంగ్రెస్ పార్టీలో పలువురు చేరారు. డీసీసీ ఉపాధ్యక్షుడు కన్నూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో మంగళవారం రెండు కుటుంబాలు కాంగ్రెస్ పార్టీలో చేరాయి. సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. నర్సీపట్నం నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తనకు అవకాశం ఇవ్వాలని దరఖాస్తు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను నేతలు ఉల్లంఘించరాదు : ఆర్డీవో జయరాం

నర్సీపట్నం అర్బన్, మార్చి 19: ఎన్నికల కోడ్‌ను అతిక్రమించకుండా రాజకీయ పార్టీల నాయకులు ప్రచారాలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలని ఆర్డీవో హెచ్‌వీ. జయరాం కోరారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో గల నాలుగు మండలాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీలో వున్న అన్ని పార్టీల అభ్యర్థులు ఊరేగింపులు, సమావేశాలపై ముందస్తుగా అనుమతులు పొందాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాగేందుకుగాను రాజకీయ పార్టీల నేతలు అధికారులకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల తహసీల్దార్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో జయరాం

టీడీపీలో చేరిన చెట్టుపల్లి సర్పంచ్

నర్సీపట్నం, మార్చి 19 : మండలంలోని చెట్టుపల్లి గ్రామ సర్పంచ్ గజాల నాగరత్నం, వార్డు మెంబర్లు కరణం రాంబాబు, బంటు రమణ, కంట్రెడ్డి లక్ష్మి, వెలంకాయల నూకరత్నం, ఎంపీటీసీ మాజీ సభ్యులు గజాల సూరిబాబు, చెల్లూరి అప్పారావు, 30 కుటుంబాల సభ్యులు మంగళవారం టీడీపీలో చేరారు. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రం పూర్తిగా దివాలా తీసిందన్నారు. చెట్టుపల్లిలో అభివృద్ధి కార్యక్రమాలన్నీ టీడీపీ హయాంలోనే జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ, పార్టీ అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన చెట్టుపల్లి సర్పంచ్, తదితరులను ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు



కోడ్ కూసినా.. తొలగించరా?

మాకవరపాలెం, మార్చి 19: ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా.. మండల పరిషత్ సమావేశం మందిర వద్ద రాజకీయ నాయకులు చిత్రాలు తొలగించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తున్నాయి. సమావేశం మందిరం వద్ద ఉన్న శిలాఫలకంపై సీఎం జగన్, ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఫొటోలు దర్శనమిస్తున్నాయి. ఎన్నికల సంఘం ఆదేశాలను మండల పరిషత్ అధికారులే ఉల్లంఘిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు.

మండల పరిషత్ సమావేశం మందిరం వద్ద సీఎం, ఎమ్మెల్యే ఫొటోలతో ఉన్న శిలాఫలకం

అవినీతికి పాల్పడిన వైసీపీ నేతలు

- ఏఎల్‌పురం-2 ఎంపీటీసీ రుత్తల రామకృష్ణ ఆరోపణ

కృష్ణాదేవిపేట, మార్చి 19: ఏఎల్‌పురం మేజర్ పంచాయతీలో వైసీపీ నాయకులు, కొంతమంది ప్రజాప్రతినిధులు అవినీతికి పాల్పడ్డారని ఏఎల్‌పురం-2 ఎంపీటీసీ సభ్యుడు రుత్తల రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నాకు భూములు లేవని, కౌలురైతు కాకపోయినా రైతు భరోసా రూ.13,500 వచ్చినట్టు వలంటీర్ల ద్వారా ప్రభుత్వం పంపిణీ చేసిన కరపత్రాల్లో ఉండడం దారుణమన్నారు. ఆ డబ్బులు ఎవరి ఖాతాలోకి వెళ్లాయని ఆయన ప్రశ్నించారు. గ్రామంలో కొంత మంది వలంటీర్లకు, పెళ్లికాని యువకులకు, సొంతిళ్లు ఉన్నవారికి, అనర్హులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడం జరిగిందన్నారు. తాను వైసీపీ నుంచి టీడీపీకి మారడంతో తన సన్నిహితుడైన వికలాంగుడికి ఇళ్ల స్థలం ఇవ్వలేదన్నారు. గ్రామంలో వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకుల మధ్య ఇళ్ల స్థలాల పంపకం విషయమై గొడవలు వస్తే అంతా నాపై రెచ్చగొట్టి లబ్ధిదారులను పంపారన్నారు. వైసీపీ నాయకత్వం తనపై చేయిస్తుందని, భయపడే ప్రసక్తి లేదని, అవసరమైతే కేసు పెడతానని ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్ఎంసీ చైర్మన్ గొర్లి లక్ష్మణ్, టీడీపీ నాయకులు లగుడు రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ

ప్రశాంత ఎన్నికలకు ప్రణాళిక

... 5వ పేజీ తరువాయి

పోలింగ్ కేంద్రాలు ఎన్ని ఉన్నాయనే సమాచారాన్ని ఇప్పటికే సేకరించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎటువంటి బందోబస్తు చర్యలు చేపట్టాలనే దానిపై దృష్టి పెట్టారు. ఆయా గ్రామాల్లో ప్రత్యేక పోలీసు బలగాలతో కవాతులు నిర్వహిస్తున్నారు. గతంలో జరిగిన ఎన్నికల్లో పోలీసుల విధులకు ఆటంకం కలిగించి, ఓటర్లను రెచ్చగొట్టేలా వ్యవహరించిన వారిని స్టేషన్‌లకు పిలిపించి బైండోవర్ చేస్తున్నారు. జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్‌లలో మొత్తం 13,886 మందిని బైండోవర్ చేశారు. ఇందులో 11,397 మందిని ఎన్నికల్లో వివాదాలు సృష్టించే అవకాశాలున్నాయనే అనుమానంతో బైండోవర్ చేయగా, 26 మంది పాత నేరస్థులు వున్నారు. అదే విధంగా గత ఎన్నికల సందర్భంగా వివాదాలు సృష్టించిన 2,756 మందిని బైండోవర్ చేశారు. ఇక రౌడీ షీటర్లు, ఇతరత్రా నేరాలతో సంబంధంవున్న వ్యక్తులను ఇప్పటికే పోలీసు స్టేషన్‌లకు పిలిపించి కౌన్సెలింగ్ చేస్తున్నారు. ఎన్నికల వేళ మద్యం, నగదు, మత్తు పదార్థాలు వంటివాటి రవాణాను కట్టడి చేసేందుకు జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. వాహనాలను 24 గంటలూ తనిఖీ చేయడానికి అవసరమైన సిబ్బందిని నియమించారు. కలెక్టర్, ఎస్పీ, ఇతర ఉన్నతాధికారులు ఆకస్మికంగా పర్యటిస్తూ, ఈ చెక్‌పోస్టులను పరిశీలిస్తున్నారు. వాహనాల తనిఖీలకు సంబంధించి సిబ్బందికి పలుసూచలను చేస్తున్నారు.

అదనపు షాక్

... 5వ పేజీ తరువాయి

రెండు కిలోవాట్లకు సర్వీస్, డెవలప్‌మెంట్ చార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్, అప్లికేషన్ ఫీజుతో పాటు జీఎస్టీ చెల్లించాలని అంటున్నారు. మొత్తం రూ.4,459 కట్టాలని డిమాండ్ నోటీసులు పంపుతున్నారు. అందులో రూ.4 వేలు అచ్చం డెవలప్‌మెంట్ చార్జీల కింద చూపిస్తున్నారు. సెక్యూరిటీ డిపాజిట్‌గా రూ.400, అప్లికేషన్ ఫీజు రూ.50, జీఎస్టీగా రూ.9 వేసి మొత్తం రూ.4,459 నెలాఖరులోగా చెల్లించాలని ఆదేశిస్తున్నారు. అలా చెల్లించకపోతే విద్యుత్ కనెక్షన్ కట్ చేస్తామని, ఆ మొత్తం చెల్లించాకే పునరుద్ధరిస్తామని అంటున్నారు. ఇలా ఒక్క జోన్-3లోనే రెండు వేల మందికి నోటీసులు జారీచేశారు. అలాగే జోన్-2, జోన్-లలో కూడా వేలాది మందికి ఈ నోటీసులు ఇస్తున్నారు. వీరంతా మధ్య తరగతివారే కావడం గమనార్హం.

తనిఖీల తర్వాతనే టెన్త్ పరీక్షా కేంద్రంలోకి విద్యార్థులు

నాతవరం, మార్చి 19 : స్థానిక హైస్కూల్‌లో టెన్త్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహిస్తున్నారు. విద్యార్థులను హైస్కూల్ గేటు వద్ద సచివాలయ మహిళ పోలీసులు తనిఖీ చేసిన తర్వాతనే పంపిస్తున్నారు. విద్యార్థుల దగ్గర స్లిప్పులు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అలాగే విద్యార్థుల దగ్గర ఉన్న డిజిటల్ వాచీలను తీసుకుని, వాటిని ఒకచోట భద్రపరచి పరీక్ష అయిన తర్వాత వెళ్లేటప్పుడు ఇచ్చేస్తున్నారు. అలాగే ఇన్విజిలేటర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లు కూడా తీసేసుకుని పరీక్షలు ముగిసిన తర్వాత ఇస్తున్నారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాసే సెంటర్లు వద్ద 144 సెక్షన్‌ను పోలీసులు అమలు చేస్తున్నారు. పరీక్షా కేంద్రాల వద్దకు ఇతరులెవ్వరిని పోలీసులు అనుమతించడం లేదు.

చోడవరం
నియోజకవర్గం



వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న ఎస్పీ

వడ్డాది వెంకన్న కల్యాణోత్సవాలకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ మురళీకృష్ణ

బుచ్చెయ్యపేట, మార్చి 19: వడ్డాది గిరిజాంబగిరిపై కొలువైన స్వయంభూ శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక కల్యాణోత్సవాలకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ చెప్పారు. కల్యాణోత్సవాల్లో బందోబస్తు ఏర్పాట్లపై డీఎస్పీ అప్పలరాజు, సీఐ అప్పలనాయుడుతో మంగళవారం ఆయన సమీక్షించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా, భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. వేద పండితులు ఆయనకు స్వామివారి ఆశీర్వాదం అందచేశారు. ఆలయ కమిటీ చైర్మన్ దొండా కన్నబాబు, దేవదాయ శాఖ ఈవో శర్మ, ఎస్ఐ డి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఓటేయండి

- టీడీపీ అభ్యర్థి కేఎస్ఎన్ఎస్.రాజు



వార్డుల్లో మహిళలతో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి రాజు

చోడవరం, మార్చి 19: అభివృద్ధికి పట్టం కట్టాలని స్థానిక నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని పలు వార్డులలో మంగళవారం ఆయన పర్యటించి ఓటర్లను కలిసి మాట్లాడారు. ఎన్నికల్లో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి ఓట్లేయాలని అభ్యర్థించారు. రాష్ట్రం బాగుకోసం కూటమి విజయానికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. ఈ కార్యక్రమంలో తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు, మాజీ ఎంపీపీ పెదబాబు, పార్టీ పట్టణ అధ్యక్షుడు దేవరపల్లి వెంకట అప్పారావు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డేడ నాగ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

తురకలపూడిలో పైడితల్లమ్మ జాతర

బుచ్చెయ్యపేట, మార్చి 19: మండలంలోని తురకపూడి గ్రామంలో మంగళవారం పైడితల్లమ్మ పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నిర్వహించిన ప్రత్యేక పూజలో కరక, చిట్టియ్యపాలెం, సీతయ్యపేట, తైపురం, చింతపాక, పెదపూడి, పీపీ.అగ్రహారం తదితర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పోటెత్తడంతో ఆలయ పరిసర ప్రాంతం సందడిగా మారింది.

బీబీ పట్నంలో రెండు వేల లీటర్ల బెల్లం పులుసు స్వాధీనం

రోలుగుంట, మార్చి 19: మండలంలోని బీబీ పట్నం గ్రామ శివారున నాటుసారా తయారీకి సిద్ధం చేసిన రెండు వేల లీటర్ల బెల్లం పులుసును స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ సురేష్ తెలిపారు. మందస్తు సమాచారంతో వెళ్లి దాడులు చేయగా, బెల్లం పులుసును గుర్తించి స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గ్రామాల్లో నాటుసారా తయారీకి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

రహదారి అధ్వానం.. రాకపోకలకు నరకం!

- కేజే.పురం-ఎం.కోటపాడు-వల్లాపురం మార్గం.. ప్రమాదకరం
- భీతిల్లుతున్న వాహనచోదకులు, జనం
- పట్టించుకోని అధికార యంత్రాంగం





కేజే పురం జంక్షన్- ఎంకోటపాడు మధ్య రాళ్లు తేలిపోయిన గతుకులతో ప్రమాదకరంగా తయారైన రోడ్డు

మాడుగుల రూరల్, మార్చి 19: వడ్డాది-పాడేరు ఆర్‌అండ్‌బీ రోడ్డులో భాగమైన కేజే.పురం జంక్షన్-ఎం.కోటపాడు-ఎంకె వల్లాపురం రోడ్డులో అడుగడుగునా గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై రాకపోకలు సాగించడానికి ప్రజలు భీతిల్లుతున్నారు. ఈ మార్గంలో ప్రయాణం దినదినగండంగా మారింది. అడుగడుగునా గోతులు వల్ల వాహనాలు వేగంగా నడిపినా కంట్రోల్ చేయలేని పరిస్థితి నెలకొంది. నెమ్మదిగా వెళ్లినప్పటికీ గోతులు దాటుకుని గమ్యం చేరడం సాహసమే అవుతోంది. అందులోనూ లోడింగ్‌తో వెళ్లే భారీ వాహనాల ప్రయాణం కూడా ఇబ్బందికరంగా తయారై ప్రమాదాలను పొంచి ఉంది. విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల వాసులకు మైదానం నుంచి మన్యానికి, మన్యం నుంచి మైదానానికి వెళ్లడానికి ఈ రోడ్డే ప్రధానం. మాడుగులకు ఈ రోడ్డే ఆధారం. ఇంత ప్రాధాన్యత కలిగిన ఈ రోడ్డు అధ్వానంగా తయారైనప్పటికీ పట్టించుకునే నాథులే కరువయ్యారు. ఈ రోడ్డుపై కొత్తగా రోడ్డు వేయలేదు. పాత రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో కంకర రాళ్లు, క్రషర్ బుగ్గి వేసి పూడుస్తున్నారు. దీంతో వాహనాలు రాకపోకలుతో క్రషర్ బుగ్గి గాల్లోకి లేచి ప్రయాణికుల కళ్లల్లో పడుతున్నది. గోతులు రోడ్డుపై వాహనాలు తప్పించుకుని వెళ్లే క్రమంలో కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ నెల 16వ తేదీన ఉదయం కేజే పురం జంక్షన్ వద్ద సిమెంట్ లోడుతో వెళుతున్న లారీ స్కూటీపై వెళుతున్న భార్యాభర్తలను ఢీకొట్టడంతో భార్య లారీ చక్రాల కింద నలిగిపోయి నుజ్జునుజ్జయి మృతి చెందిన విషయం తెలిసిందే. స్కూటీ నడుపుతున్న భర్త స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. కేజే పురం జంక్షన్ వద్ద పలు చోట్ల ఉన్న గుంతలు రోడ్డు కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు మండిపడుతున్నారు. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వానంగా ఉన్నందున ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి పడిపోయి ప్రమాదాల బారిన పడిన సందర్భాలు చాలా ఉన్నాయి. ఎప్పటికి ఈ రోడ్డు సమస్యకు పరిష్కారం లభిస్తుందోనని ఎదురుచూడడం తప్ప ఒరిగిందేమి లేదని ఆయా ప్రాంతాల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

రీ సర్వేలో భూమి పోయిందని రైతు ఆందోళన

- భూమి సాగు చేస్తున్నా.. దస్తావేజులు ఉన్నా తొలగింపు
- న్యాయం చేయాలని విన్నపం

రోలుగుంట, మార్చి 19: జగనన్న భూ రక్ష పథకం రైతులకు కష్టాలకు తెచ్చిపెడుతున్నది. అప్పటి వరకు వెబ్ ల్యాండ్‌లో ఉన్న భూమి, రీ సర్వే చేసిన తర్వాత ఇతరుల పేర్ల మీద ఆన్‌లైన్ చేయడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. దీంతో రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. తమ న్యాయం చేయాలని ఉన్నతాధికారులను ఎంత మొర పెట్టుకుంటున్నా, అన్ని రికార్డులు ఉన్నా రీ సర్వేలో భూమిని ఎందుకు తొలగించారంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు

కొత్తకోటకు చెందిన శ్రీకాకుళపు సత్యారావు 2022లో రోలుగుంట మండలం గుర్రంపేట గ్రామ రెవెన్యూలో సర్వే నెం 3-3లో 0.90 ఎకరాల భూమిని అనిమిరెడ్డి రాజుబుల్లి ద్వారా కొనుగోలు చేశారు. అనంతరం దస్తావేజుల ద్వారా రెవెన్యూ అధికారులకు దరఖాస్తు చేస్తే క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా జారీ చేశారు. కాగా ఇటీవల జగనన్న భూ రక్ష పథకంలో గుర్రంపేటలో రీ సర్వే చేపట్టారు. రీ సర్వేలో ఇతని సమక్షంలోనే వీఆర్వో ప్రసాద్, సర్వేయర్లు సర్వే చేపట్టి నమోద చేస్తామని తెలిపారు. కాగా ఇటీవల ఆన్‌లైన్‌లో చూసుకుంటే వెబ్ ల్యాండ్‌లో సత్యారావు భూమిని తొలగించి అదే గ్రామానికి చెందిన అల్లు జగద భర్త నరసింహమూర్తి పేరుమీద మార్చివేసినట్లు ఉంది. దీంతో సత్యారావు లబోదిబోమంటూ గత నెల రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. నేను సాగులో ఉన్నాను, నా పేరుమీదనే అన్ని దస్తావేజులు ఉన్నాయి, భూమి తగవుల్లో కూడా లేకపోయినా కావాలనే వీఆర్వో లంచాలకు కక్కుర్తి పడి తీసేశారని ఆరోపిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టి నాకు తగిన న్యాయం చేయాలని బాధిత రైతులు తెలిపారు.



పత్రాలు చూపిస్తున్న బాధిత రైతు

విద్యా వ్యవస్థలో డొల్లతనం

... 5వ పేజీ తరువాయి

విద్యార్థుకు ఇక ఉపాధ్యాయుడు, తామరం పాఠశాలలో ఆరుగురు విద్యార్థుకు ఇక ఉపాధ్యాయుడు, బూరుగుపాలెం స్కూల్లో నలుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు వున్నారు. ఇంకా చంద్రయ్యపాలెం ప్రాథమిక పాఠశాలలో ఆరుగురు విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడు, ఎస్‌జీఆర్‌పీ అగ్రహారం పాఠశాలలో ఎనిమిది మంది విద్యార్థులకు ఒక టీచర్ ఉన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాల్లో పరిస్థితి ఇందుకు విరుద్ధంగా వుంది. ఇటీవల జారీ చేసిన జీవో 117 ప్రకారం ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు స్కూల్ అసిస్టెంట్లు (సబ్జెక్టు టీచర్లు) బోధన చేయాలి. కానీ పైడిపాల, తూటిపాల, దాలింపేట, కొండలఅగ్రహారం, రామన్నపాలెం, పీపీఅగ్రహారంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు లేరు. సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతోనే బోధన సాగిస్తున్నారు. మండలంలో 12 ప్రాథమికోన్నత పాఠశాలలు వుండగా.. జంగాలపల్లి, వెంకటాపురం పాఠశాలల్లో మాత్రమే 117 జీవో ప్రకారం స్కూల్ అసిస్టెంట్‌లు వున్నారు. మిగిలిన పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు లేకపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందడంలేదు. దీనిపై ఎంఈవో మూర్తిని వివరణ కోరగా, ప్రస్తుతం ప్రాథమికోన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండడంతో సబ్జెక్టు టీచర్ (స్కూల్ అసిస్టెంట్లు) పోస్టులను ప్రభుత్వం మంజూరు చేయలేదని, దీంతో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులతోనే బోధన చేయిస్తున్నామని చెప్పారు.

డిప్యూటీ సీఎం బూడిని ఓడిద్దాం

- నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పైలా ప్రసాదరావు

చీడికాడ, మార్చి 19: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడును ఓడించడానికి అందరూ ముందుకు రావాలని మాడుగుల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు కోరారు. మండల కేంద్రంలో జనసైనికులతో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారిని పైలా పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే నియోజకవర్గం ఇన్‌చార్జి పివిజి.కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నియోజకవర్గంలోని మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులను, నాయకులను కలిశానని చెప్పారు. వారి సలహాలు, సూచనలతో చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోని ప్రజలకు వివరిస్తూ వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. సమావేశంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు మూర్తి, టీడీపీ నాయకులు ఆర్.సన్యాసినాయుడు, పి.కొండబాబు, ఆర్.రాము, డి.బలరాం, ఎరుకునాయుడు పాల్గొన్నారు.



పైలా ప్రసాదరావుకు జ్ఞాపిక అందిస్తున్న నేతలు

'గెలుపు కోసం అలుపు వద్దు'

దేవరాపల్లి: గెలుపు కోసం అలుపు వద్దని కార్యకర్తలు పనిచేయాలని పైలా ప్రసాదరావు కోరారు. కాశీపురంలో జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం సమావేశమయ్యారు. సూపర్ సిక్స్, భవిష్యత్‌కు గ్యారంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. జనసేన ఇన్‌చార్జి రాయపురెడ్డి కృష్ణ, గొర్రుపోటు రామ్మూర్తి నాయుడు, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

మాడుగుల
నియోజకవర్గం



భక్తులతో కలిసి ఘటాలు మోస్తున్న డిప్యూటీ సీఎం బూడి

ఘనంగా మోదకొండమ్మ ఘటాల పండగ

- అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు

మాడుగుల, మార్చి 19: మండల కేంద్రంలోని మోదకొండమ్మ అమ్మవారి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దీంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే గ్రామ ఉప సర్పంచ్ శ్రీనాడు శ్రీనివాసరావు 51 ఘటాలతో పండగ నిర్వహించారు. నెత్తిన ఘటాలతో గ్రామ పుర వీధుల మీదుగా ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి ఘటాలను సమర్పించుకున్నారు. ఈ ఘటాల పండగకు ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు హాజరై నెత్తిన ఘటాలు పెట్టుకొని కొంత దూరం నడిచారు. భక్తుల సౌకర్యార్థం కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

గ్రామాల్లో పోలీసు కవాతు



గ్రామాల్లో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

మాడుగుల రూరల్, మార్చి 19: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఇందులో భాగంగా మంగళవారం మాడుగుల, ఎం.కోటపాడు, ఎం.కోడూరు తదితర గ్రామాల్లో కేంద్ర పోలీసు బలగాలతో కవాతు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని ఈ సందర్భంగా సీఐ స్వామినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాడుగుల ఎస్ఐ దామోదరనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

పీఏసీఎస్ మాజీ చైర్మన్ మృతికి బూడి సంతాపం

మాడుగుల రూరల్, మార్చి 19: సత్యవరం గ్రామానికి చెందిన పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుకూరి నాగరాజు మృతి పట్ల డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సంతాపం తెలిపారు. మంగళవారం గ్రామానికి వెళ్లి నాగరాజుకు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి సానుభూతి తెలిపారు. అతని వెంట ఇన్‌చార్జి ఎంపీపీ రాజారామ్, నాయకులు రామదర్మజ, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

అభ్యర్థి ఎంపిక నిర్ణయానికి కట్టుబడి ఉన్నాం

- టీడీపీ మండల నాయకుల సుస్పష్టం

చీడికాడ, మార్చి 19: మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పైలా ప్రసాదరావును పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఎంపిక నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు పేరపు కొండబాబు తెలిపారు. చీడికాడలో మంగళవారం టీడీపీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యావంతుడు, ఐటీ రంగ నిపుణులైన ప్రసాదరావును ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడం ఆనంద దాయకమన్నారు. చంద్రబాబు తీసుకున్న నిర్ణయానికి అందరం కట్టుబడి ఉన్నామన్నారు. అన్ని వర్గాల వారు ప్రసాదరావుకు మద్దతు నిచ్చి చంద్రబాబును సీఎం చేయడానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు రెడ్డి రాము, డి.వరహాలునాయుడు, మిస్కా రామరాజుయాదవ్, గొర్లె గణేష్, పాతాళం ఎర్రునాయుడు, కె.ఎరుకునాయుడు పాల్గొన్నారు.

క్రైం... crime news

32 కిలోల గంజాయి స్వాధీనం, ముగ్గురి అరెస్టు


పట్టుకున్న గంజాయితో డీఎస్పీ సత్యనారాయణ, పోలీసు అధికారులు

సబ్బవరం, మార్చి 19: ఆటోలో తరలిస్తున్న 32 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు పోలీసులు తెలిపారు. పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. జాతీయ రహదారిపై అనకపల్లి ఫ్లైఓవర్ వద్ద ఎస్.ధనుంజయ్ మంగళవారం ఉదయం వాహనాలు తనిఖీ చేస్తున్నారు. సబ్బవరం వైపు నుంచి అనకాపల్లి వెళుతున్న ఒక ఆటోను ఆపి తనిఖీ చేయగా గంజాయిని రెండు కిలోల చొప్పున ప్యాకింగ్ చేసిన 16 ప్యాకెట్లు కనిపించాయి. ఆటోలో ఉన్న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లికి చెందిన కిల్లో గిరిబాబు, వంతల చంటిబాబు, వంతల కోటేశ్వరరావును అదుపులోకి తీసుకుని ఆటోతో సహా పోలీసు స్టేషన్‌కు తరలించారు. చింతపల్లిలో ఓ వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేసినట్టు నిందితులు చెప్పారు. అనంతరం గంజాయిని, ఆటోను సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కేసును సీఐ పిన్నింటి రమణ దర్యాప్తు చేస్తారని డీఎస్పీ చెప్పారు.

భార్యను వేధించిన కేసులో జైలు శిక్ష, జరిమానా

సబ్బవరం, మార్చి 19: భార్యను వేధింపులకు గురిచేసినట్టు నేరం రుజువు కావడంతో ముద్దాయితోపాటు అతని సోదరుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ అనకాపల్లి 7వ ఎంఎం కోర్టు జడ్జి తీర్పు చెప్పారని సీఐ పిన్నింటి రమణ తెలిపారు. మండలంలోని బోదివలస గ్రామానికి చెందిన నేబర్తి శ్రీను, త్రివేణి భార్యాభర్తలు. అయితే భర్తతోపాటు అతని తమ్ముడు రమేశ్, సోదరి బెల్ల పద్మ తనను వేధిస్తున్నారంటూ త్రివేణి 2020 జూలై 7న పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. బాధితురాలి తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృనాళిని వాదనలు వినిపించారు. నిందితులపై మోపిన అభియోగం రుజువు కావడంతో బాధితురాలి భర్త నేబర్తి శ్రీనుకు ఏడాది జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా, ఇతని సోదరుడు రమేశ్‌కు నెల రోజులు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి బీవీవీ విజయలక్ష్మి తీర్పు చెప్పారు.

15 మద్యం సీసాలు స్వాధీనం

పరవాడ, మార్చి 19: మండలంలోని పెదముషిడివాడ గ్రామానికి చెందిన జె.త్రినాథ్ నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ మల్లేశ్వరరావు తెలిపారు. లంకెలపాలెంలోని ప్రభుత్వం దుకాణం నుంచి పరిమితికి మించి మద్యం కొనుగోలు చేసి తీసుకెళుతున్నట్టు సమాచారం అందడంతో మంగళవారం నిఘా పెట్టామన్నారు. లంకెలపాలెం నుంచి పెదముషిడివాడ వెళుతున్న జె.త్రినాథ్‌ను ఆపి తనిఖీ చేయగా మద్యం సీసాలు లభ్యమయ్యాయన్నారు. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

50 లీటర్ల నాటు సారా స్వాధీనం

నర్సీపట్నం, మార్చి 19 : సెబ్ అధికారులు పురపాలక సంఘం పరిధి పెదబొడ్డేపల్లిలో నిర్వహించిన దాడుల్లో 50 లీటర్లు నాటు సారా స్వాధీనం చేసుకొని 1250 లీటర్లు బెల్లం పులుపు ధ్వంసం చేశారు. సెబ్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్‌కుమార్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగళవారం పెదబొడ్డేపల్లి గ్రామానికి చెందిన పిల్లి సత్తిబాబు(37)ను అరెస్టు చేసి 50 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకొని, 250 లీటర్లు బెల్లం పులుపు ధ్వంసం చేశారు. ఈ కేసులో పెంకె చిన్న పరారీలో ఉన్నట్టు సెబ్ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు. అదే గ్రామంలో మరో చోట దాడులు చేసి 1000 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం చేశామని తెలిపారు. ఈ కేసులోని నిందితుడు పిల్లి సత్తిబాబుపై గత ఏడాది బైండోవర్ కేసు ఉందని తెలిపారు.

భవనం పైనుంచి జారిపడి తాపీమేస్త్రీ మృతి

కోటవురట్ల, మార్చి 19: తాపీమేస్త్రీ ఒకరు నాలుగు అంతస్థుల భవనం పైనుంచి ప్రమాదవశాత్తూ జారిపడి మృతిచెందాడు. కోటవురట్ల ఎస్ఐ రమణయ్య అందజేసిన వివరాలిలా ఉన్నాయి. కోటవురట్ల మండలం లింగాపురం గ్రామానికి చెందిన యాసారపు రామకృష్ణ(25) తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా కోటవురట్లలో అల్లు ముసలయ్య అనే వ్యక్తి నాలుగు అంతస్థుల భవనం నిర్మిస్తున్నారు. రామకృష్ణ మంగళవారం ఇక్కడ పనులు చేయడానికి వచ్చాడు. పనులు చేస్తుండగా అదుపు తప్పి కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి గత ఏడాది అక్టోబరులో వివాహమైంది. భార్య ప్రస్తుతం గర్భవతి. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొత్తపాలెంలో 200 కిలోల గంజాయి స్వాధీనం?

» పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు!

విశాఖపట్నం, మార్చి 19: జీవీఎంసీ 89వ వార్డు పరిధి కొత్తపాలెంలోని ఓ ఇంట్లో నిల్వ చేసిన గంజాయిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. కొత్తపాలెంలోని నాగేంద్ర కాలనీ జంక్షన్‌లోని మెడ్‌ప్లస్ మందుల షాపు వద్ద కాలనీకి చెందిన ఓ కుటుంబీకులు సాయంత్రం వేళలో టిఫిన్ షాపు నిర్వహిస్తుంటారు. వీరు తమ సామగ్రిని పెట్టుకునేందుకు గాను మెడ్‌ప్లస్ వెనక ఉన్న ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. కాగా టిఫిన్ షాపు యజమానికి సమీప బంధువైన ఓ వ్యక్తి తన ఇంట్లోని కొన్ని సామాన్లను టిఫిన్ దుకాణం యజమాని అద్దెకు తీసుకున్న గదిలో కొద్ది రోజుల పాటు ఉంచడానికి అనుమతి తీసుకుని వాటిని భద్రపరిచాడు. అయితే అందులో గంజాయి ఉన్నట్టు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం ఉదయం దాడి చేసి ఆ గదిలో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి సుమారు 200 కిలోలు ఉంటుందని సమాచారం. గంజాయిని నిల్వ చేసినందుకు గాను ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. గంజాయి నిల్వ చేసిన గదిని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ అయ్యన్నార్ మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ కేసు దర్యాప్తులో ఉన్నందున వివరాలు తెలపడానికి పోలీసులు నిరాకరించారు.

కోటవురట్లలో అధ్వానంగా పారిశుధ్యం

» మెయిన్ రోడ్డుపైనే చెత్తాచెదారం

» పట్టించుకోని పంచాయతీ అధికారులు


కోటవురట్ల జంక్షన్ వద్ద వేసిన చెత్తాచెదారం

కోటవురట్ల, మార్చి 19: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుపై పారిశుధ్యం అధ్వానంగా ఉంది. ఇళ్లలో సేకరించిన చెత్తాచెదారాన్ని పారిశుధ్య కార్మికులు తీసుకువచ్చి మెయిన్ రోడ్డుపై వేస్తున్నారు. పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు విమర్శిస్తున్నారు. కోటవురట్ల మేజర్ పంచాయతీ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఇళ్ల వద్ద సేకరించిన చెత్తచెదారాన్ని పారిశుధ్య కార్మికులు తీసుకువచ్చి మెయిన్‌రోడ్డు పక్కనే వేస్తున్నారు. ఇదే అదనుగా భావించిన వ్యాపారులు కూడా అక్కడే చెత్తను వేస్తున్నారు. ఈ చెత్త కుళ్లి దుర్వాసన వస్తున్నది. ఇక్కడ చెత్తచెదారాన్ని తొలగించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా మెయిన్‌రోడ్డుపై చెత్త వేస్తున్న విషయం తనకు తెలియదని, పరిశీలించి తొలగింపునకు చర్యలు తీసుకుంటానన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	430
విజయనగరం	434
శ్రీకాకుళం	434

శిలాఫలకంతో సరిపెట్టేశారు!

▶ కార్యరూపం దాల్చని బీచ్ ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు




ఆర్కేబీచ్‌లో కోతకు గురైన ఇసుకతెన్నెలు

» నాలుగున్నరేళ్ల క్రితం ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన
» విశాఖ స్వరూపమే మారిపోతుందంటూ కబుర్లు
» రూ.250 కోట్ల వ్యయం అవుతుందని అంచనా
» తొలిదశ పనులకు రూ.116 కోట్లతో టెండర్లు ఆహ్వానం
» కాంట్రాక్టు దక్కించుకున్న హైదరాబాద్ సంస్థలు
» అడ్వాన్స్ విడుదల చేయకపోవడంతో అగ్రిమెంట్ కూడా చేసుకోకుండానే వెనక్కి...

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

"విశాఖకు పర్యాటకంగా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకొస్తాం. అందుకోసమే బీచ్‌ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం. ఈ ప్రాజెక్టుతో ఆర్కే బీచ్ స్వరూపమే మారిపోతుంది. ప్రపంచస్థాయి సదుపాయాలతో పర్యాటకులకు స్వర్గధామంగా నిలుస్తుంది."

- ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

(2019 డిసెంబరు 28న సిటీ సెంట్రల్ పార్కు వద్ద బీచ్ ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన సందర్భంగా...)

..అయితే నాలుగున్నరేళ్లు గడిచిపోయినా ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు. రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదలపై చేతులెత్తేయడంతో టెండరు దక్కించుకున్న సంస్థ అగ్రిమెంట్ చేసుకోకుండానే వెనుతిరిగిపోయింది.

విశాఖ అనగానే ఎవరికైనా ఆర్కే బీచ్ గుర్తుకొస్తుంది. అటువంటి బీచ్ హుద్‌హుద్ కారణంగా కొంత దెబ్బతింది. అలల ఉధృతికి కోతకు గురైంది. బీచ్‌ను ఆనుకుని ఉన్న పార్కుల ప్రహరీ గోడలు సైతం కోత కారణంగా కూలిపోయాయి. ఈ నేపథ్యంలో విపత్తులు వంటివి సంభవించినా ఎలాంటి నష్టం జరగకుండా బీచ్ ఫ్రంట్‌ను రీడెవలప్ చేయడంతోపాటు సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడం, ప్రపంచస్థాయి వసతులను సమకూర్చడం లక్ష్యంగా ఏపీ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్టు (ఏపీడీఆర్‌పీ) పేరుతో బీచ్‌ఫ్రంట్ రీడెవలప్‌మెంట్‌కు వైసీపీ ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ప్రపంచ బ్యాంకు ఆర్థిక సహాయంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కొంత వాటా సమకూర్చేలా డీపీఆర్‌ను తయారుచేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా కోస్టల్ బ్యాటరీ నుంచి పార్క్ హోటల్ జంక్షన్ వరకూ 3.5 కిలోమీటర్లు బీచ్‌ను అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. ఆ ప్రాంతంలో మూడు కిలోమీటర్లు పొడవున బీచ్‌లో రక్షణ గోడ నిర్మాణం, సైక్లింగ్ ట్రాక్, 1.8 మీటర్లు వెడల్పున మూడు కిలోమీటర్ల వాకింగ్ ట్రాక్, ఐదుచోట్ల ప్రజా మరుగుదొడ్లు, ఎనిమిది చోట్ల తాగునీటి సదుపాయం, పర్యాటకులకు స్థానిక ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా ప్రస్తుతం ఉన్న దుకాణాలను చిన్నపాటి మాల్స్‌గా అభివృద్ధి చేయడం, పిల్లలు, పెద్దలకు వేర్వేరు సదుపాయాలతో రిక్రియేషన్ పార్కులు, బీచ్‌లోకి సురక్షితంగా వెళ్లి వచ్చేలా ఎంపిక చేసిన చోట ప్రత్యేక మార్గాలు నిర్మాణం, సర్వీస్ రోడ్లు అభివృద్ధి, పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు, ఆకర్షణీయంగా బస్‌బేలు, పర్యాటకులకు వసతి, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదం కలిగించేలా ల్యాండ్ స్కేపింగ్, సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాలు, దేశ విదేశాల్లో జరిగే ప్రత్యేక వేడుకలను ప్రత్యక్షంగా సందర్శకులు వీక్షించేందుకు వీలుగా యాంపీ థియేటర్, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలు కల్పిస్తామని ప్రకటించారు. ఇందుకోసం రూ.250 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఒకేసారి కాకుండా నాలుగు దశల్లో ప్రాజెక్టును పూర్తిచేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం సూచన మేరకు జీవీఎంసీ అధికారులు తొలిదశ పనుల కోసం రూ.110 కోట్లతో 2019లో టెండర్ పిలిచారు. హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ ఇన్‌ఫ్రాటెక్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ, ఎస్‌పీఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థతో కలిసి రూ.116 కోట్లకు (రూ.ఆరు కోట్లు అధికం) టెండరు దక్కించుకుంది. నెలరోజులపాటు బీచ్ వెంబడి సర్వే నిర్వహించి అక్కడున్న పరిస్థితులను గుర్తించి, తర్వాత 17 నెలల్లోగా ప్రాజెక్టును పూర్తిచేయాలని టెండర్ దక్కించుకున్న సంస్థ భావించింది.

కదలిక లేని ప్రాజెక్టు

ముఖ్యమంత్రి హోదాలో 2019 డిసెంబరు 28న తొలిసారి నగరానికి వచ్చిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సిటీ సెంట్రల్‌పార్క్‌లో రూ.116 కోట్లతో బీచ్‌ఫ్రంట్ రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. విశాఖ అభివృద్ధికి ఈ ప్రాజెక్టు మేలిమలుపు కాబోతోందని ఆ కార్యక్రమంలో పాల్గొన్న వైసీపీ నేతలు గొప్పలు చెప్పారు. కానీ, నాలుగున్నరేళ్లు గడిచినా ప్రాజెక్టు అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభించేందుకు అడ్వాన్స్‌గా కాంట్రాక్టర్‌కు కొంత మేర రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి. ఈ విషయమై సదరు కాంట్రాక్టు సంస్థ ఎన్నిసార్లు ప్రస్తావించినా పాలకుల నుంచి సానుకూల స్పందన లేకపోవడంతో అగ్రిమెంట్ చేసుకోకుండానే వెళ్లిపోయిందని జీవీఎంసీ అధికారులు చెబుతున్నారు.

ఉపమాకలో వెంకన్న కల్యాణోత్సవాలు ప్రారంభం

» మాఢవీధుల్లో కావడి ఊరేగింపు


అశ్వవాహనంపై స్వామివారి తిరువీధి

నక్కపల్లి, మార్చి 19: ఉపమాక క్షేత్రంలో శ్రీవారి తిరు వార్షిక కల్యాణోత్సవాలు మంగళవారం లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభ సూచికగా ఉదయం 11 గంటలకు మాఢవీధుల్లో కావడి ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల ప్రసాదాచార్యులు, అర్చకులు పూజా కార్యక్రమాలు చేశారు. సాయంత్రం 6.30 గంటలకు ఉత్సవాల అంకురార్పణ, కంకణధారణ, మృత్యంగ్రహణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కాగా తూర్పుగోదావరి జిల్లాకు చెందిన జాస్తి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులు సుమారు రూ.2 లక్షల వ్యయంతో స్వామివారి ఆలయానికి ఇత్తడి గజ వాహనాన్ని తయారు చేయించి అందజేశారు. నూతన వాహనంపై ఉభయదేవేరులతో కూడిన స్వామివారిని అలంకరించి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.


నూతన గజవాహనంపై స్వామివారిని ఉంచి పూజలు చేస్తున్న అర్చకులు


ఉత్సవాల ప్రారంభ సూచికగా మాఢవీధుల్లో కావడి ఊరేగింపు

ఓటు అడిగే హక్కు జగన్‌రెడ్డికి లేదు

» హామీలను నెరవేర్చకుండా ప్రజలను మోసగించారు
» వైసీపీ ఐదేళ్ల పాలనలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు పూర్తికాలేదు
» జనసేన అభ్యర్థి కొణతాల రామకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

తుమ్మపాల, మార్చి 19: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి గత ఎన్నికల్లో బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని, అవి నెరవేర్చకుండా ప్రజలను మోసగించిన ఆయనకు రానున్న ఎన్నికల్లో ఓటు అడిగే హక్కు లేదని ఉమ్మడి అభ్యర్థి కొణతాల రామకృష్ణ అన్నారు. మంగళవారం టీడీపీ జిల్లా కార్యాలయంలో ముఖ్యనాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఒక్క సాగునీటి ప్రాజెక్టు కూడా పూర్తికాలేదన్నారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు నిర్మించడం చేతకాని ముఖ్యమంత్రి అని జగన్‌ను ఉద్దేశించి విమర్శించారు. రాష్ట్రంలో పూర్తిగా మద్య నిషేధాన్ని అమలు చేసిన తర్వాతే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని ఐదేళ్ల క్రితం అధికారంలోకి వచ్చినప్పుడు జగన్మోహన్‌రెడ్డి గట్టిగా చెప్పారని, ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని మహిళలను ఓట్లు అడుగుతారని కొణతాల ప్రశ్నించారు.. ప్రతి ఏటా జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తానని చెప్పి నిరుద్యోగులను వంచించారని ధ్వజమెత్తారు. వైసీపీ నాయకులు బందిపోటు దొంగల ముఠాగా తయారై రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆయన తీవ్రస్థాయిలో విమర్శించారు. కక్ష సాధింపే అజెండాగా పాలన సాగిస్తున్నారని, రివర్స్ టెండర్ పేరుతో ఒక్క అభివృద్ధి పని కూడా పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని, అనకాపల్లిని మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని చెప్పారు. వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డంపెట్టుకుని టీడీపీ, జనసేన శ్రేణులను పలు ఇబ్బందులకు గురి చేశారని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీ జిల్లా అధ్యక్షుడు బుద్ద నాగజగదీశ్వరరావు మాట్లాడుతూ, నియోజకవర్గంలోని కాపులకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చే క్రమంలో జిల్లా అధ్యక్ష పదవిని సైతం త్యాగం చేస్తానని, ఈ విషయాన్ని అధిష్ఠానం దృష్టికి కూడా తీసుకువెళతానని చెప్పారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావడమే అందరి ఏకైక లక్ష్యమన్నారు. రాష్ట్రంలో సాగుతున్న రాక్షస పాలన ముగింపునకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, వైసీపీ ప్రజావ్యతిరేక పాలన గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు మాదంశెట్టి నీలబాబు, డాక్టర్ నారాయణరావు, కొణతాల వెంకటరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యుడికి అండగా..

» నిరుపేద వెన్నెముక శస్త్రచికిత్సకు రూ.10.6 లక్షల సాయం
» విరాళాలు సేకరించి అందించిన 'సాయానికి రూ.పది సంస్థ' ప్రతినిధులు

కొత్తూరు, మార్చి 19 : అనకాపల్లికి చెందిన 'సాయానికి పది రూపాయలు సంస్థ' ప్రతినిధులు మరోసారి తమ సేవా భావాన్ని చాటుకున్నారు. సెంట్రింగ్ పనిచేస్తూ రెండంతస్థుల భవనం మీద నుంచి పడిపోయిన వ్యక్తి వెన్నెముక ఆపరేషన్ కోసం విరాళాలు సేకరించి పది లక్షల ఆరవై వేల రూపాయలను అందించారు. నర్సీపట్నం మునిసిపాలిటీ మూడో వార్డుకు చెందిన మర్ర శ్రీహరి భవన నిర్మాణ పనులకు (సెంట్రింగ్) వెళుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఏడాది క్రితం సెంట్రింగ్ పనులు చేస్తూ రెండు అంతస్థుల భవనం నుంచి కింద పడిపోయాడు. దీంతో వెన్నెముక దెబ్బతిన్నది. ఆపరేషన్ కోసం రూ.6 లక్షలపైనే ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. ఆర్థిక స్తోమత లేకపోవడంతో శస్త్రచికిత్స చేయించుకోలేక మంచానికే పరిమితమయ్యాడు. భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఎన్నో అవస్థలు పడ్డారు. నిస్సహాయ స్థితిలో ఉన్న శ్రీహరి కుటుంబం సాయం కోసం 'సాయానికి పది రూపాయలు సంస్థ'ను సంప్రదించింది. దీంతో సంస్థ ప్రతినిధులు శ్రీహరి కష్టాన్ని, పరిస్థితిని తెలుగు రాష్ట్రాల్లో ఉన్న తమ సభ్యులకు, వారి ద్వారా పలువురికి వీడియో రూపంలో పంపించారు. దీంతో ఎంతో మంది స్పందించి తమకు తోచిన సాయం అందించారు. పది రోజుల్లోనే రూ.10,59,904 సమకూరాయి. ఈ మొత్తాన్ని అనకాపల్లిలో ప్రముఖ హోమియోపతి వైద్య నిపుణులు డాక్టర్ శశిధర్, ఏఎంఏఎల్ కళాశాల బోటనీ అధ్యాపకుడు డాక్టర్ ఎం.హరిబాబు, నర్సీపట్నం ఎంఈవో జీవీఎస్ నాగేంద్ర, బయాలజీ ఉపాధ్యాయుడు వీవీ.ప్రభాకర్ చేతుల మీదుగా మంగళవారం శ్రీహరి కుటుంబానికి అందజేశారు. భారీ మొత్తంలో సొమ్ము సేకరించి, బాధిత కుటుంబానికి అందజేసిన 'సాయానికి పది రూపాయలు సంస్థ' అధ్యక్షుడు లాలం ఏసుబాబు, సభ్యులను పలువురు అభినందించారు.


శ్రీహరి కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న డాక్టర్ శశిధర్ తదితరులు

పరీక్షా కేంద్రాల బందోబస్తు పరిశీలించిన ఎస్పీ


బందోబస్తుపై సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి టౌన్, మార్చి 19 : పట్టణంలో జరుగుతున్న పదో తరగతి పరీక్షా కేంద్రాల వద్ద బందోబస్తును జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ మంగళవారం పరిశీలించారు. పట్టణంలోని గవరపాలెం ఉన్నత పాఠశాల, శ్రీచైతన్య విద్యాసంస్థల్లో జరుగుతున్న పరీక్షా కేంద్రాల్లో సిబ్బంది ఏ విధంగా బందోబస్తు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఆయన వెంట పట్టణ సీఐ జి. శంకరరావు ఉన్నారు.

బీసీ బాలికల గురుకులంలో వసతులపై ఆరా

» పరిశీలించిన రాష్ట్ర కార్యదర్శి


విద్యార్థినులతో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్

ఎస్.రాయవరం, మార్చి 19: మండలంలోని లింగరాజుపాలెంలోని ఎంజేపీ ఏపీ బీసీ డబ్ల్యూ బాలికల రెసిడెన్షియల్ (గురుకులాన్ని) పాఠశాలను మంగళవారం బీసీ గురుకులాల రాష్ట్ర కార్యదర్శి కృష్ణమోహన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్ అక్కడి విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అలాగే పదో తరగతి బాలికలతో మాట్లాడిన పరీక్షలు ఎలా రాస్తున్నారనేది ఆరా తీశారు. అక్కడున్న వంటశాల, వాష్ రూమ్ తదితర వాటిని కృష్ణమోహన్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ వెంకటరెడ్డి, గురుకులం ప్రిన్సిపాల్ లక్ష్మి పాల్గొన్నారు.

టెన్త్ హిందీ పరీక్షకు 97.65 శాతం మంది హాజరు

అనకాపల్లి రూరల్, మార్చి 19: పదో తరగతి పరీక్షల్లో భాగంగా మంగళవారం నిర్వహించిన హిందీ పరీక్షకు 97.65 శాతం మంది విద్యార్థులు హాజరైన జిల్లా విద్యా శాఖాధికారి వెంకట లక్ష్మమ్మ తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 21,204 మందికిగాను 20,860 మంది హాజరయ్యారని, 344 మంది పరీక్ష రాయలేదని చెప్పారు. ప్రైవేటు విద్యార్థులు 252 మందికిగాను 93 మంది మాత్రమే హాజరయ్యారు. 159 మంది గైర్హాజరు అయినట్టు ఆమె తెలిపారు. రెగ్యులర్, ప్రైవేటు విద్యార్థులు కలిపి మొత్తం 21,456 మందికిగాను 20,953 (97.65 శాతం) మంది హాజరయ్యారని, 503 మంది పరీక్షకు రాలేదని డీఈవో పేర్కొన్నారు.

తిమ్మాపురం కార్యదర్శి, వీఆర్వోలకు షోకాజ్ నోటీసులు


తిమ్మాపురం కార్యదర్శి, వీఆర్వోలను వివరణ కోరుతున్న ఆర్వో

నక్కపల్లి, మార్చి 19: ఎస్.రాయవరం మండలం తిమ్మాపురంలో పాయకరావుపేట నియోజక వర్గం వైసీపీ అభ్యర్థి కంబాల జోగులుకు చెందిన ఫ్లెక్సీని తొలగించకపోవడంతో కార్యదర్శి రామిరెడ్డి, వీఆర్వో నూకరాజుకు ఎస్.రాయవరం తహసీల్దార్ జయలక్ష్మి షోకాజ్ నోటీసులు ఇచ్చారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గీతాంజలి చెప్పారు. వీఆర్వో, కార్యదర్శిల నుంచి వివరణ తీసుకున్నాని, ఇటువంటివి పునరావృతం కాకూడదని సూచించారని తెలిపారు.